ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణభాస్కర



## (పూలపల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 20-4-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మనమనస్సుకు పవిత్రత అవసరం. నిష్కామకర్మచేయకపోతే చిత్తశుద్ధిరాదు. చిత్తశుద్ధి లేకపోతే ముముక్షత్వంరాదు. ముముక్షత్వం లేకపోతేఆత్మజ్ఞానంరాదు. ఆత్మజ్ఞానం లేకపోతే మోక్షంరాదు. భారతీయులలో అనేకమంది రామనామం చేసి పవిత్రులు అయ్యారు. గాంధిగారు రామనామం చేసి మహాత్ముడు అయ్యాడు. సాక్షాత్తు పరబ్రహ్మమే కళ్యాణగుణాలతో రామచంద్రుడి రూపంలో వచ్చింది అని చెపుతారు. రామచంద్రుని యొక్క కళ్యాణ గుణాలు, నడవడిక, నిరహంకార స్థితి గురించి వాల్మీకి రామాయణంలో వివరంగా చెప్పాడు. కర్మఫలమును విడిచిపెట్టు, ఏ పనిచేయకూడదు అనే మనస్తత్వం పనికిరాదు అని కృష్ణుడుగీతలో చెప్పాడు. కొంతమంది ఇంటిలోనూ ఏ పనిచేయరు, సమాజంలో కూడపని చేయరు. పని లేకుండా తిరుగుతూ ఉంటారు. పనిచేయకపోతే పొట్టవెళ్ళదు. ఏ పనిచేయకుండా సోమరితనంగా ఉండకూడదు, పనిచేసి ఫలితాన్ని విడిచిపెట్టాలి అనిచెప్పాడు.

జాగ్రదావస్థ, స్వప్నం, గాడనిద్ర ఇవిమూడు అవస్థలు నిజంకాదు. తురీయావస్థ ఒకటి ఉంది. అది ఒక్కటి మాత్రమే నిజం అనిచెప్పారు. గాఢనిద్ర, స్వప్నం, జాగ్రదావస్థ ఇవి నిజం కాదు అంటున్నారు. కాని ఇవి అన్ని మాకు నిజంలాగ కనిపిస్తున్నాయి అని అడిగితే ఆత్మానుభవం కలిగినవాడికి ఇవి అన్నీ అసత్యం అని తెలుస్తుంది. అహంకారికి మటుకు ఈ అవస్థలు, చావుపుట్టుకలు అన్ని నిజంలాగ కనిపిస్తాయి అని చెప్పారు. సంసారంలో వచ్చే కష్ట సుఖాలు, చావుపుట్టుకలు ఇవి అన్ని ఎంతకాలం నిజంలాగ కినిపిస్తున్నాయో అంతకాలం మనం అహంకారంలో ఉన్నట్లు గుర్తు అని భగవాన్ చెప్పారు. శరీరం యొక్క చలనం, మనస్సులో వచ్చే వికారములు, జనన మరణములు ఇవి అన్ని నూటికి నూరుపాళ్ళు అసత్యమే కాని నీ అహంకారానికి ఇవి అన్నీ సత్యంక్రింద కనిపిస్తుంది. నీశరీరానికి చావు వస్తుంది అంటే నీకు దుఃఖం వస్తోంది ఎందుకంటే అది నీకు సత్యం క్రింద కనిపిస్తోంది అందువలన చావు అంటే దుఃఖం వస్తోంది. అహంకారికి ఇవి అన్ని నిజంగాని ఆత్మానుభవం కలిగిన వాడికి తురీయస్థితి ఒక్కటే నిజం అని తెలుస్తుంది.

మన శరీరానికి ఒకటే రూపం కాని అహంకారానికి అనేక రూపాలు ఉంటాయి. అహంకారం యొక్క చేష్టలను మనం అర్థం చేసుకోవాలి. మీరు ఎంత చదువు చదివినా, సమాజానికి ఎంతసేవచేసినా, సన్యాసం స్వీకరించి జీవితం గడిపినా అహంకారబుద్ధి నశించకపోతే మీకు జ్ఞానం కలుగదు. మీరు నిష్కామకర్మ చేసినా అహంకారం నశించకపోతే మీకు జ్ఞానం కలుగదు.అహంకారానికి గుర్తింపుకావాలి. గుర్తింపులేకపోతే ఏ పనిచేయదు. లోకంకూడా అహంకారానికి తోక. అహంకారము ఉన్నంతసేపు ఈ తోకతెగదు. అహంకారం ఉన్నంతసేపు మనం ఈ లోకం లోనికి వస్తూ ఉంటాము, పోతూ ఉంటాము. అహంకారము ఉన్నంతసేపు ఈ ప్రయాణాలు

ఎవరు ఆపలేరు. కొంతమందికి ధనం ఉంటుంది, అందం ఉంటుంది, అధికారం ఉంటుంది, చదువు ఉంటుంది. కాని లోపలచూస్తే హృదయంలో ఏమీ ఉండదు. అంతా ఖాళీ ఉట్టిగుల్లలు. అటువంటి వారికి జ్ఞానం కలుగదు విషయవిరక్తి ఉంటేనే మనస్సు అంతర్ముఖం అవుతుంది. విషయముల పట్ల అనురాగం ఉంటే మనస్సు బాహ్యంగా విజృంబిస్తూ ఉంటుంది. నేను ఎవడను అనే విచారణ అందరికి సాగదు. ఎవరికైతే విషయముల పట్ల విరక్తి, లోకం పట్ల వైరాగ్యం ఉందో వాడికి మాత్రమే నేను ఎవడను అనే విచారణ బాగా సాగుతుంది.

ఉపనిషత్‌ల సారం, గీతయొక్కసారం ఏమిటంటే నీవు శరీరం ధరించి ఈభూమి మీదకువచ్చావు. ఆ శరీరం నువ్వుకాదు. ఆ శరీరం ప్రారబ్ధం ననుసరించి ఎంతకాలం ఉండాలో అంతకాలం ఉంటుంది, ఏ పనిచెయ్యాలో అది చేస్తుంది. నీ ప్రాణం ఏదో రోజుపోతుంది. ఆ ప్రాణం ప్రయాణం చేయకుండా నీ హృదయంలో ఉన్నశాంతిలో ఐక్యమయ్యేలాగ చూసుకోవాలి. అదేజీవిత గమ్యం. అది తప్పించి మిగిలినవి ఏమి సాధించినా స్వప్నంతో సమానం అని చెప్పారు. శరీరం ధరించినందుకు, శరీరానికి మరణం రాకముందే నువ్వు సాధనచేసి, గురువును ఆశ్రయించి, వినయం కలిగి ఉండి నీలో పునర్జన్మను తీసుకొని వచ్చే వాసనలు ఏమి ఉన్నాయో వాటిని బయటకు లాగి మంటపెట్టటమే నీవు చేయవలసిన పని.

నీ మనస్సు పనికిరాని విషయాలను, అక్కరలేని విషయాలను చింతిస్తోంది. నీ మనస్సు ఎక్కువబాడి చేసుకొంటోంది. నీ మనస్సును బాగుచేసుకోవాలి. నీవు ఏ దేవుడిని ఆరాధించినా, ఏ గురువును ఆశ్రయించినా కామక్రోధములనుండి, రాగద్వేషముల నుండి బయటకు రాకపోతే వాడికి మోక్షం రాదు, కామక్రోధములనుండి, రాగ ద్వేషములనుండి బయటకు రావటం అంతతేలికకాదు. దీనికి మీ తెలివితేటలు సరిపోవు. భగవంతుడికి శరణాగతి చెందితే కామక్రోధములనుండి, రాగద్వేషములనుండి మనలను విడుదల చేస్తాడు. నీ మనస్సే అహంకారంగా విజృంభిస్తోంది. జగత్తును, జీవుడిని, ఈశ్వరుడిని నీమనస్సే కల్పిస్తోంది. ఈ మనస్సు అణిగిపోతే ఏమీలేదు. ఈమనస్సు అణగటానికే గురువును ఆశ్రయించాలి. జగ్రదావస్థ, స్వప్నం, గాఢనిద్ర ఇవి అన్ని సాపేక్షిక సత్యములు మాత్రమే. తురీయస్థితి మాత్రమే సత్యం. దానినే చైతన్యం, ఆత్మ అంటున్నారు. దానిలోనే నిజమైన సుఖం, శాంతి ఉన్నాయి. ప్రతిమనిషికి సుఖం కావాలి. డబ్బులో అధికారంలో సుఖం ఉంది అని వెతుక్కొంటాడు. అలా అన్వేషించి, అన్వేషించి సుఖం అనేది బయట ఎక్కడలేదు ఒక్కచైతన్యంలోనే ఉంది అని తెలిసిన తరువాత చైతన్యానుభవం పొందటానికి ప్రయత్నంచేస్తాడు. ఎంత అనుభవించినా తరుగులేని శాంతి, సుఖం నీ హృదయంలో ఉన్నాయి. కాని అది నీకు తెలియటంలేదు కాబట్టి అక్కడ సుఖంలేదు అనుకొంటున్నావు. అదిలేకపోవటం వలన నీకు తెలియకపోవటంకాదు. అది నీకు తెలియకుండా నీబేధబుద్ధి, నీ దేహబుద్ధి అడ్డువస్తోంది.

సత్సంగము వలన ప్రాపంచిక విషయాలతో ఉన్న సంబంధం తొలగుతుంది హోలి కంపెని విడిచిపెట్టవద్దు. లౌకికులుకు యుక్తులు, కుతంత్రాలతో ఉంటారు. ఈ కుయుక్తులను, కుతంత్రాలను లోకంలో వెదజల్లుతూ మేము తెలివైనవారము అనుకొంటారు. వారితో సహవాసం చేస్తే మీకు జ్ఞానం కలుగదు. సత్పురుషులతో, ఎవరైతే నిరాడంబరముగా, నిశ్చలంగా ఉంటారో వారితో సహవాసం

చేస్తే మీకు తెలియకుండా నెమ్మదిగా మీమనస్సు ప్రాపంచిక విషయాల వైపుకు వెళ్లటం తగ్గుతుంది. అందుచేత సజ్జనసాంగత్యం విడిచిపెట్టవద్దు. పెద్దపెద్ద సాధనలు మీరుచేయలేకపోయినా సత్పురుషులతో సహవాసం విడిచిపెట్టవద్దు. సత్పురుషులతో మీకు ఉన్న సంబంధం మాయతో మీ మనస్సుకు ఉన్న సంబంధాన్ని తగ్గిస్తుంది. మహాగురువులు, జ్ఞానులు నీకు దొరకకపోయినా సత్వగుణం ఉన్నవారితో సహవాసం చేస్తే నీకు రజో గుణం, తమోగుణం తగ్గిపోతాయి, అవినయం తగ్గుతుంది. సత్పురుషులతో సహవాసం వలన నీలోని వాసనలు అన్ని కాలిబూడిద అవుతాయి. దాని ప్రభావం అటువంటిది. నీమనస్సుకు చాపల్యం ఉన్నప్పటికి సత్పురుషుల సహవాసం వలన మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది. అందువలన సత్పురుషులతో సహవాసమును కాంక్షించు. దానివలన ముందు నీవాసనలు తగ్గిపోతాయి సత్పురుషుల గుణాలను ఆస్వాధిస్తావు. ఆగుణవైభవమును అనుభవిస్తావు. ఇలాఅనుభవించగా అనుభవించగా శరీరం ఉండగానే జీవన్ముక్త స్థితి నీకు కలుగుతుంది. అందువలన సత్పురుషుల సహవాసమును ఆకాంక్షించు, సంపాదించు అని భగవాన్ చెపుతున్నారు. శాస్త్రజ్ఞానం కాకుండా అనుభవజ్ఞానం ఉన్నవారి దగ్గర కూర్చొంటే, వారితో సహవాసం చేస్తే నీ మనస్సు వెళ్ళి హృదయంలో కరిగిపోతుంది అంటున్నారు భగవాన్.

కొంతమంది సంఘంలో గౌరవంగా ఉన్నమనుషులతోటి, పదవులు ఉన్న మనుషులతోటి సహవాసంచేస్తూ ఆగౌరవంతోటి, పదవులతోటి తాదాప్యం పొందుతూ ఉంటారు. కొంతమంది వారికి డబ్బులేకపోయినా డబ్బుఉన్న చుట్టాలతో తాదాప్యం పొందుతూ ఉంటారు. వీటివలన మీకు తెలియకుండా మీలో ఉన్న అజ్ఞానం పెరుగుతూ ఉంటుంది. పూజలు, జపాలు తరువాత చేయవచ్చు ముందు ఇటువంటి పిచ్చిగొడవలు విడిచిపెట్టండి అంటున్నారు. ఇటువంటి తెలియని రోగాలు మీలో చాలా ఉంటాయి. ఇవి అన్నీ సత్పురుషులతో సహవాసం వలన నశిస్తాయి అని చెపుతున్నారు. ఒక మహాగురువుతో, జ్ఞానితో, అవతారపురుషునితో నీకు అనుబంధంలేకపోతే నీవు ఎన్ని శాస్త్రములు చదివినా, ఎన్ని ఉపన్యాసములు విన్నా ఎన్ని మంచిపనులు చేసినప్పటికి నీకుశాంతి లభించదు సత్పురుషుల సహవాసం చాలముఖ్యం అని భగవాన్ చెపుతున్నారు.

వెన్నెల వలన తాపం పోతుంది. కల్పవృక్షం వలన దారిద్ర్యం పోతుంది. గంగాజలం తాగితే, భగవంతుడిని ఉపాసిస్తే పాపంపోతుంది. ఒక్క జ్ఞానిని ఆశ్రయించటంవలన ఇవి అన్నీ నీవు పొందుతావు అంటున్నారు. ఎన్ని గుడుల చుట్టుతిరిగినా, ఎన్ని నదులలో స్నానం చేసినా పవిత్రత సంపాదించటానికే. నిన్ను పవిత్రుడిని చేయటానికి ఇవి అన్నీ చాలకాలం తీసుకొంటాయి. వందజన్మలలో ఈగుడులు, గోపురాలు, నదులు నిన్ను పవిత్రుడిని చేయగలిగితే జ్ఞాని యొక్క ఒక్క చూపుచాలు అదినిన్ను ప్రభావితుడిని చేసి పరిశుద్ధుడిని చేస్తుంది. నిన్ను పవిత్రుడిని చేయటమేకాదు నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు అర్థమయ్యేటట్లు చేసి ఆ సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వచ్చేటట్లు గురువు యొక్క మౌనం చేస్తుంది. అది గురువు యొక్క వైభవం. నీవు పక్కానికి వచ్చి ఉంటే గురువు యొక్క మాట, చూపు, చేత నీకు అక్కరలేదు. నిన్ను ఆత్మసింహాసనం మీద కూర్చోబెట్టటానికి గురువు యొక్క మౌనం నీకు సరిపోతుంది. మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటం కాదు, మౌనం అంటే ఆత్మే.

మీరు ఇక్కడ నుండి కదలటంలేదు సమాజంలోనికి వచ్చి బోధించవచ్చు కదా అని భగవాన్‌ను ఒక భక్తుడు అడిగాడు. నేను బోధించటంలేదు అని నీకు ఎలా తెలుసు? బోధించటం అంటే ఉపన్యాసములు చెప్పటమా? ఎదుటి మనిషి ప్రభావం వలన నీమనస్సులో ఎంతవరకు మార్పువస్తోందో అది ముఖ్యం. ఏదైతే బాగుపడాలో అది బాగవుతోందో లేదో చూసుకో. నీకు ఆత్మజ్ఞానం కలిగితే నువ్వు హిమాలయాలలో ఉన్నా నీ మౌనం యొక్క ప్రభావం, శక్తి తరంగాలు లోకం మీద పనిచేస్తూ ఉంటాయి. లోకానికి మేలు చేయటానికి ఉపన్యాసములు చెప్పనక్కరలేదు, పుస్తకాలు వ్రాయనక్కరలేదు. ఇవి అన్నీ రెండవ పక్షం,. గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. గురువు అనుగ్రహం వలన ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం కలుగుతుంది. చైతన్యం మౌనంగా పనిచేస్తుంది. మౌనానికి శక్తి ఉంది. ఆ శక్తి తరంగాల వలన జరగవలసిన పనులు జరుగుతాయి. ఎవరైనా తిట్టారు అనుకోండి. మనకు దుఃఖం వస్తుంది. అంటే మాటకు శక్తి ఉంది. ఏదైనా మంచిమాట విన్నాము అనుకోండి ఆమాట మనల్ని తరుముతూ ఉంటుంది కదా. మాటకే అంతశక్తి ఉన్నప్పుడు మౌనానికి, ఆత్మకి, చైతన్యానికి ఎంత శక్తి ఉంటుందో నోటితో ఏమి చెపుతాము అంటున్నారు. శరీరం మరణించేలోపు మాట, మనస్సు, ప్రాణం నీ హృదయంలో అణిగిపోతే శరీరం పడిపోయిన మరుక్షణంలో మహాకాంతిలో మహావెలుగులో మనం ఐక్యమవుతాము. ఆ స్థితిని పొందలేకపోతే పునర్జన్మ సిద్ధమవుతుంది. సూర్యుడు మనకు చీకటిని ఇద్దాము అనుకొన్నా ఇవ్వలేడు ఎందుచేతనంటే ఆయన దగ్గర చీకటిలేదు. అలాగే జ్ఞాని మనకు అశాంతిని ఇవ్వాలన్నా ఇవ్వలేడు ఎందుచేతనంటే ఆయన దగ్గర అశాంతిలేదు. ఆయన దగ్గర ఉన్నది శాంతేకాబట్టి శాంతినే ఇస్తాడు. ఎన్నో జన్మలు సాధనలు చేసి, పూజలు చేసి, జపాలు చేసి పొందలేని స్థితిని బ్రహ్మానుభవం పొందినవాడి దగ్గర కూర్చొంటే ఆ స్థితిని నీవు పొందుతావు అంటున్నారు. జ్ఞాని హృదయంలో నుండి వచ్చే శక్తి తరంగాలు భక్తుడిని పరిశుద్ధుడిని చేసి శాంతిలో స్థిరపడేలాగ చేస్తాయి.

**శ్రీ నాన్నగారి ప్రవచనములు జూన్ 27వ తేది నర్సాపురం**

**జూన్ 29వ తేది జిన్నూరు**